క్లుప్తంగా

పసుపుమయం



గంగమాంబపురంలో కోళ్లఫారానికి పసుపు రంగు

విజయపురం: గత ప్రభుత్వంలో అన్ని కార్యాలయానికి పార్టీ రంగు వేస్తున్నారంటూ రాద్ధాంతం చేసిన టీడీపీ శ్రేణులు ప్రస్తుతం ఏది కట్టినా పసుపు రంగు వేస్తున్నారు. దీన్ని చూసి అంతా అవాక్కయిపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మించిన షెడ్లకు కూడా పసుపు రంగు వేయడం సొమ్మొకరిది సోకు ఒకరిది అన్న చందాన ఉందన్నారు. ఇలాంటి షెడ్లకు పసుపు రంగు వేయకూడదని అధికారులు సూచిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నెరవేర్చాలి



మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినమాట నెరవేర్చాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం నగరి పట్టణంలో నిర్వహించిన అంగన్‌వాడీ సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీలకు ఇచ్చినమాట ప్రకారం జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్ వాడీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఐటీయూసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గేట్‌వాల్వ్ లీకేజీ అరికట్టండి



గేట్‌వాల్వ్ నుంచి వృథా పోతున్న తాగునీరు

విజయపురం: మహారాజపురం గ్రామంలో తాగునీటి ట్యాంక్ వద్ద ఉన్న గేట్‌వాల్ లీకేజీను అరికట్టాలని స్థానిక ప్రజలకు కోరుతున్నారు. గేట్‌వాల్వ్ మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా ఇంత వరకు సరిచేయలేదు. గేట్‌వాల్వ్ లీకేజీ కారణంగా ట్యాంకు కింద పారిశుద్ధ్యం లోపించింది. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా అధికారులు ప్రచారం చేస్తున్నా.. కింది స్థాయి అధికారులు ఏమాత్రం పాటించడం లేదు. ఇప్పటికైనా అధికారులు గేట్‌వాల్వ్‌ను బాగు చేసి, తాగునీటి వృథా అరికట్టాలని కోరారు.

3న విజయపురంలో జాబ్ మేళా

విజయపురం: ఈ నెల 3న పన్నూరు సబ్ స్టేషన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ గణేష్ శనివారం ఓ ప్రకటన తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్ మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు వచ్చే విద్యార్థులు సర్టిఫికెట్లతోపాటు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకొని రావాలన్నారు.

శాస్త్రోక్తంగా వీరాంజనేయ బాలాలయ ప్రతిష్ట



పూజల్లో వేదపండితులు

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శ్రీ వీరాంజనేయ స్వామి బాలాలయ ప్రతిష్టాపన పూజలను శనివారం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈ పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పుణ్యాహవచనం, అంకురార్పణ, పాలిక ఆరాధన, నివేదన, తదితర పూజలు భక్తి ప్రపత్తులతో జరిపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ లీకేజ్



గ్రామం మధ్యలో చెత్త, ప్లాస్టిక్ కవర్లు



మురికి కాలువపై పెరిగిన పిచ్చి మొక్కలు

ఈ సమస్యలు తీరేదెన్నడో?

- రామ సముద్రంలో సమస్యలు తిష్ట
- ప్రమాదకరంగా తాగునీటి ట్యాంక్
- పైప్‌లైన్ లీకేజ్
- పారిశుధ్యం అధ్వానం.. పిచ్చిమొక్కలు దర్శనం
- గ్రామం వైపు కన్నెత్తి చూడని కార్యదర్శి

వడమాలపేట(విజయపురం): మండలంలోని రామసము ద్రం గ్రామంలో సమస్యలు తిష్ట వేసుకునానయి. మురికి కాలువపై పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. తాగునీటి పైపులైన్ లీకేజ్ అవుతున్నా పట్టించుకోవడం లేదు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్, చెత్త దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల వీధిలైట్లు నిత్యం వెలుగుతూనే ఉంది. కొన్ని చోట్ల అసలు వీధిలైట్లు లేవు. ఇన్ని సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ కార్యదర్శి కన్నెత్తి చూడడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.
వడమాలపేట పంచాయతీ రామసముద్రంలో మొత్తం 200 కుటుంబాలు, వెయ్యి మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో అడుగు వేస్తే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. తాగునీరు అందించే పైపులైన్ లీకేజ్ కావడంతో నీరంతా వృథా పోతున్నా ఇంత వరకు వాటిని సరి చేయలేదు. లక్ష లీటర్ల తాగునీరు కాలువలో కలిసి పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియడం లేదు.

• పారిశుధ్యం అధ్వానం

గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త, ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. మురికి కాలువలపై పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీంతో గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. రాత్రి పూట దోమలు ఎక్కువగా ఉంటున్నాయి. మురికి కాలువలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో నీరు ముందుకు కదలడం లేదు.

• కనిపించని వీధిలైట్లు

గ్రామాల్లో పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉన్నాయి. ఏ వైపు నుంచి విషసర్పాలు వస్తాయో తెలియడం లేదు. దీనికి తోడు కొన్ని చోట్ల వీధిలైట్లు లేకపోవడం ప్రజలకు శాపంగా మారింది. కొన్ని చోట్ల వీధిలైట్‌కు ఆన్‌అండ్ ఆఫ్ స్విచ్ లేకపోవడంతో నిత్యం వెలుగుతూనే ఉన్నాయి.

• కానరాని కార్యదర్శి

గ్రామాల్లో సమస్యలు తిష్ట వేసుకొని కూర్చొని ఉంటే అటు వైపు పంచాయతీ కార్యదర్శి కన్నెత్తి చూడడంలేదు. కనీసం పారిశుధ్య పనులపై దృష్టి సారించడం లేదు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని స్థానిక ప్రజలు అంటున్నారు.



శిథిలావస్థలో తాగునీటి ట్యాంక్

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

కార్వేటినగరం: వైఎస్ఆర్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కలసి పని చేయాలని జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. శనివారం పుత్తూరు పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ పదవుల్లో నియమితులైనవారిని కృపాలక్ష్మి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా నియమితులైనవారు ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా కార్యవర్గ కార్యదర్శి బాలాజీ, మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజా, మునికృష్ణ, నందగోపాల్, శేషాద్రి, పద్మనాభశెట్టి, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు సుందర్‌రాజ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడిని సన్మానిస్తున్న సమన్వయకర్త కృపాలక్ష్మి

ఐదు కిలోల బియ్యం కోసం..

పాలసముద్రం: దేవుడా.. ఐదు కిలోల బియ్యం కోసం ఇన్ని అవస్థలా అని ఓ వృద్ధురాలు శనివారం నడవలేక నడుస్తూ రేషన్ బియ్యం కోసం అవస్థలు పడింది. రేషన్ షాపు వద్ద ఎంతసేపు పడిగాపులు పడాలోనని అనుకుంటూ బయల్దేరింది. సన్నగుంటకు చెందిన పాపమ్మ పాలసముద్రంలో రేషన్ తీసుకోవాల్సి ఉంది. అందుకే అవస్థలు పడుతూ రేషన్ కోసం బయల్దేరింది. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవారు. ఇలాంటి వృద్ధులకు సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం ఇలాంటి వృద్ధుల పరిస్థితి దయనీయంగా మారింది.



రేషన్ బియ్యం కోసం వెళ్తున్న వృద్ధురాలు

సీపీడబ్ల్యూఎస్ ట్యాంక్ పరిశీలన



ఇల్లత్తూరు సీపీడబ్ల్యూఎస్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న సీఈఓ

విజయపురం: మండలంలోని ఇల్లత్తూరు కుశస్థలి నదిలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ ట్యాంక్‌ను జెడ్పీ సీఈఓ రవికుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. తాగునీరు సరఫరా చేసే పైపులైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించి, మరమ్మతులకు గురైన పైపులను సరి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీహరి, ఏఈ శర్మ, కాంట్రాక్టర్ బాలసుబ్రమణ్యం ఉన్నారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని మోపిరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులను ఏపీడీ డాక్టర్ బండారు సుబ్రమణ్యం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేతన దారులతో మాట్లాడారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఫారంపాండ్లు, పండ్ల తోటల్లో రింగ్ ట్రెంచ్, సరిహద్దు కందకాలు, నీటి నిల్వ, నీటి సంరక్షణ పనులు చేయాలని సూచించారు. మండలంలో 85 పశువుల షెడ్లు మంజూరు చేశామన్నారు. అదనపు ప్రోగ్రాం అధికారి డాక్టర్ గుణశేఖర్, సాంకేతిక నిపుణులు పలువురు పాల్గొన్నారు.

పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఢీకొన్న లారీ



పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ఢీకొన్న లారీ

పుత్తూరు: పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఓ లారీకి బ్రేక్ ఫెయిల్యూర్ కావడంతో అదుపు తప్పి ఎదురుగా ఉన్న పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ఢీకొట్టింది. అదృష్టవశాత్తు సంఘటనా సమయంలో కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికే చెందిన యుగంధర్ అనే వ్యక్తి తనకు చెందిన లారీలో స్వయంగా స్థానిక ఎఫ్‌సీఐ గోదాము నుంచి బియ్యాన్ని రేషన్ షాపులకు తరలిస్తూ ఉంటాడు. యథావిధిగా శనివారం మధ్యాహ్నం బియ్యం లోడ్‌తో లారీని స్థానిక నగరం రోడ్డు నుంచి తిరుపతి–నగరి రోడ్డు వైపును నిదానంగా తిప్పేటప్పుడు బ్రేక్ ఫెయిల్యూర్ కావడంతో అదుపుతప్పి ఎదురుగా ఉన్న పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గది ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా నాదమునిరెడ్డి

శ్రీరంగరాజపురం: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మంగుట గ్రామానికి చెందిన నాదమునిరెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు తులసిమణి, నాగరాజు, ప్రభు, నటరాజ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అండగా ఫీజు పోరు

కార్వేటినగరం: విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వం మెడలు వంచేందుకు ఈ నెల 5న ఫీజు పోరు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి తెలిపారు. శనివారం పుత్తూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఫీజు పోరుకు సంబంధించి పోస్టర్లను నేతలతో కలిసి ఆవిష్కరించారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. విద్యా దీవెన పథకం ద్వారా రూ.2800 కోట్లు, వసతి దీవెన కింద రూ. 1100 కోట్లు బకాయిలు పెట్టడంతో విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా మారాయన్నారు. ఫీజు పోరు ఆందోళనకు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గురవారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శులు మరకాలకుప్పం రామయ్య, బాలాజీ, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, మండలాల అధ్యక్షులు పద్మనాభ రెడ్డి (వెదురుకుప్పం), శేఖర్‌రాజు(కార్వేటినగరం), విజయకుమార్‌రెడ్డి (పెనుమూరు), మణి(శ్రీరంగరాజపురం), ధనంజయవర్మ, దూదిమోహన్, జనార్ధన్, క్రిష్టారెడ్డి, చందురాజు , మునిక్రిష్ణ పాల్గొన్నారు.



ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమన్వయ కర్త కృపాలక్ష్మి

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- రికార్డులు లేని 42 ద్విచక్ర వాహనాలు సీజ్
- నగరి డీఎస్పీ మహమ్మద్ అజీజ్ హెచ్చరిక

వెదురుకుప్పం: ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని నగరి డీఎస్పీ మహమ్మద్ అజీజ్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశంతో శనివారం మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ నక్కలాంపల్లె గ్రామంలో కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు సక్రమంగా లేని 42 ద్విచక్ర వాహనాలను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నక్కలాంపల్లె గ్రామంలో నాటు సారా, ఇతర ప్రభుత్వ నిషిద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు సమాచారం అందడంతో అటవీ ప్రాంతంలో దాడులు చేశామన్నారు. అనంతరం గ్రామస్తులకు మత్తుపదార్థాల తయారీ, నాటు సారా తయారు చేసి విక్రయించడం, సేవించడం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. చట్ట వ్యతిరేక పనులు మానుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలని, వాహనాల దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటు సారా తయారు చేసి విక్రయించినట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు సుమన్(శ్రీరంగరాజపురం), వెంకటసుబ్బయ్య(వెదురుకుప్పం), రాజ్‌కుమార్(కార్వేటినగరం) సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

సంపంగి సాగు.. లాభాలు బాగు



మహావీరపురంలో సాగులో ఉన్న సంపంగి

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- నాటిన రెండేళ్ల వరకు భయం ఉండదు

విజయపురం: సంపంగి సాగు చేసే రైతులకు మంచి లాభాలు ఉంటున్నాయి. సాధారణ రోజుల్లో వీటికి ధర తటస్థంగా ఉన్నప్పటికీ పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో భలేగిరాకీ ఉంటోంది. మొదట్లో ఈ సాగుపై ఆసక్తి చూపని రైతులు ఆదాయాలను పసిగట్టిన తరువాత దృష్టి సారిస్తున్నారు. మహావీరపురం, సూరికాపురం విజయపురం, కేవీపురం, బూచివానత్తం, పన్నూరు తదితర గ్రామాల్లో రైతులు ఈ సాగు చేస్తున్నారు.

• సాగు విధానం

సంపంగి గడ్డను విత్తనానికి తీసుకున్న తరువాత శుద్ధి చేసి చల్లదనం ఉన్న చోట 15 నుంచి 20 రోజులు నీడలో ఉంచాలి. సాధారణ పద్ధతిలో సాగు చేసినట్లయితే ఒక అడుగుకు దూరంలో బోదలు తోలుకుని బోదకు ఒక వైపునే నాలుగు నుంచి ఐదు ఇంచుల దూరంలో గడ్డను విత్తాలి. బోదకు బోదకు అడుగు దూరం ఉంటే కలుపు తీయడానికి పూలు కోయడానికి సులభంగా ఉంటుంది. డ్రిప్ పద్ధతిలో అయితే రెండు అడుగులకు ఒక బోద తొలి సాధారణ పద్ధతిలాగే గడ్డను విత్తుకోవాలి. ఒక్కసారి గడ్డను విత్తిన తరువాత రెండేళ్ల వరకు పూలు పూస్తాయి.

• సస్యరక్షణ చర్యలు

నెలకోసారి బోదల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో కలుపు తీయించుకోవాలి.. సేంద్రియ ఎరువుతో పాటు నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులు వినియోగించాలి. నెలకోసారి ఎకరాకు 20 నుంచి 30 కిలోల ఎరువును బోదల నడుమ వేయాలి. పరిస్థితిని బట్టి మొక్కకు సాగు నీరు పారించాలి.

• దిగుబడి

సాధారణ పద్ధతిలో ఆరు నెలల నుంచి అధికంగా దిగుబడి వస్తుంది. డ్రిప్ పద్ధతిలో నాలుగు నెలల నుంచే దిగుబడి సాధించవచ్చు. ఒక సెంటు భూమికి ఒక కేజీ చొప్పున దిగుబడి వస్తుంది. ఇలా ఎన్ని సెంట్లలో మొక్క సాగు చేస్తే అంత పంట ప్రతి రోజూ చేతికొస్తుంది.

• ఆదాయం

సాధారణ రోజుల్లో కిలో రూ.30 నుంచి రూ.80 ధర పలికితే పండుగలు, పెళ్లిళ్ల గృహ ప్రవేశాలు ఉన్న రోజుల్లో ఈ పూలనే అధికంగా అలంకరణకు వినియోగిస్తారు. ఈ సమయంలో కిలో రూ.500 వరకు పలుకుతుంది. రెండేళ్ల కాలంలో పెట్టుబడిగా ఎకరాకు రూ.రెండు లక్షలు వెచ్చిస్తే ఆదాయం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు వస్తుంది.

సాయిసేవలో మరో కలికితురాయి

పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ సేవా కార్యక్రమాల్లో మరో కలికితురాయి చేరింది. అతి తక్కువ అద్దె చెల్లించి పెళ్లిళ్లు చేసుకోవడానికి అత్యాధునిక వసతులు కలిగిన కల్యాణ మండపం అందుబాటులోకి తీసుకొచ్చారు. లక్షలు చెల్లిస్తే గాని దొరకని కల్యాణ మండపాల నేపథ్యంలో కేవలం రూ.39 వేలు మాత్రం అద్దెగా చెల్లించి పెళ్లిళ్లు చేసుకోవడానికి సాయిబాబా సేవా సమాజం ముందుకు రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నేడు కల్యాణ మండపం ప్రారంభోత్సవం
- భక్తుల విరాళాలు రూ.3 కోట్లతో నిర్మాణం
- నామమాత్రపు అద్దెతో పెళ్లిళ్లకు అవకాశం

పుత్తూరు: పట్టణంలోని శ్రీషిరిడీ సాయిబాబా నిత్యాన్నదాన సాంఘిక సేవా సమాజం ప్రజలకు తీపి కబురు అందించింది. భక్తులు ఇచ్చిన విరాళాలతో అత్యాధునిక వసతులతో పుత్తూరు పట్టణం బైపాస్ రోడ్డులో నిర్మించిన సాయిబాబా కల్యాణ మండపాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ప్రజలు నామమాత్రపు అద్దె చెల్లించి పెళ్లిళ్లు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. స్థానిక టీబీ రోడ్డులో వందేళ్ల క్రితం చిన్న మండపంలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయం 1988లో శ్రీ షిరిడి సాయిబాబా సేవాశ్రమంగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి భక్తుల సేవలో దినదినాభివృద్ధి చెందిన ఆలయం 1999లో శ్రీషిరిడీ సాయిబాబా నిత్యాన్నదాన సాంఘిక సేవా సమాజంగా ఏర్పడింది. అప్పటి నుంచి ఆలయంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు వేగం పుంజుకొన్నాయి. నాటి నుంచి నేటి వరకు ప్రతిరోజూ సాధువులు, వికలాంగులు, వయోవృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ప్రతి నెలా తొలి పౌర్ణమి రోజున పల్లకి సేవ నిర్వహిస్తున్నారు. ప్రతిఏటా వచ్చే శ్రీరామనవమి, గురు పౌర్ణమి, విజయదశమి, దత్తజయంతి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు సాయి నామ సప్తాహం నిర్వహిస్తారు. అనంతరం పట్టణ పుర వీధుల్లో సాయినాథుడి ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిఏటా జూలై రెండో గురువారం నాడు భక్తులు స్వహస్తాలతో బాబాకు పాలాభిషేకం నిర్వహించడంతోపాటు నిత్యాన్నదానం ఆలయ ప్రత్యేకత. పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న సాయి సేవా సంఘానికి భక్తుల నుంచి నగదు, వస్తురూపేణా భారీ విరాళాలు వచ్చాయి. దీంతో అందరికీ అవసరమైన కల్యాణ మండపం ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభోత్సవ వేడుకలు

కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం 3 గంటలకు గణపతి పూజ, వాస్తు బల, వాస్తుహోమం, కరికోళం జలాధివాసం, శయ్యాధివాసం, సాయిగణపతి విగ్రహ స్థాపన నిర్వహించారు. ఆదివారం ఉదయం 4.30 గంటలకు గోపూజ, ప్రవేశం, పాలుపొంగించు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 గంటలకు సాయి సత్యవ్రతం నిర్వహిస్తారు.



ఆలయంలో ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా

రూ.39 వేల అద్దె



లాభాపేక్ష లేకుండా రూ.39 వేలకే కల్యాణ మండపాన్ని అద్దెకు ఇచ్చేందుకు ఆలయ సేవా సమాజం నిర్ణయించింది. తారతమ్యాలకు తావు లేకుండా ముందుగా వచ్చిన వారికి కల్యాణ మండపం కేటాయించనున్నాం. సాయి అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– పి.విజయకృష్ణ, ఆలయ అధ్యక్షుడు, పుత్తూరు

వణికిస్తున్న చలి



పొగమంచు కారణంగా తెల్లారిన జాతీయ రహదారిపై లైటుతో వస్తున్న వాహనాలు

గుడిపాల: చలి పంజా విసురుతోంది. దీంతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఉదయం 8 గంటల వరకు పొగమంచు కమ్మేస్తుండడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. గ్రామాల్లో పనులు చేసుకునేందుకు పొలాల్లోకి వెళ్లే రైతులు, దినసరి కూలీలు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు, పట్టణాల్లో విద్యాసంస్థలకు వెళ్లే గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8గంటల వరకు మంచు కమ్మేస్తోంది. ఈ కారణంగా వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పలు చోట్ల చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

పుత్తూరులో గోరక్ష మహా పాదయాత్ర



పుత్తూరులోకి ప్రవేశించిన గోరక్ష మహాపాదయాత్ర

పుత్తూరు: అఖిల భారత గోసేవ ఫౌండేషన్ బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో జమ్ముకశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహించబడుతున్న గోరక్ష మహా పాదయాత్ర శనివారం పుత్తూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక విశ్వహిందూ పరిషత్‌కు చెందిన రామారావు, కోటకొండబాబు బృందం స్వాగతం పలికింది. అనంతరం గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ 27వ తేదీన జమ్ముకశ్మీర్ నుంచి కాలినడకన బయల్దేరగా 128 రోజులపాటు 3700 కి.మీ. నడక సాగించి నేడు పుత్తూరుకు చేరుకొన్నట్లు తెలిపారు. మరో 1200 కి.మీ 52 రోజులు నడక సాగించి కన్యాకుమారి చేరుకోనున్నట్లు వివరించారు. గోవధను నిషేధించాలని, గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలన్న లక్ష్యంతో పాదయాత్ర చేస్తున్నట్లు వెల్లడించారు. గోసంరక్షణతోనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అనంతరం పట్టణ పురవీధుల ద్వారా గోరక్ష పాదయాత్రను కొనసాగించారు. కార్యక్రమంలో గీతా సమాజం బాలకృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్ సభ్యులు శ్రీధర్‌రాజు, గిరిప్రసాద్, రామకృష్ణ, కుమారస్వామి, ఆనందమూర్తి, అరుణాచలరెడ్డి పాల్గొన్నారు.